ఆకాశామల గాత్రం దైవమ్
తారారవి శశి నేత్రం దైవమ్
వ్యాపక పవన శశితం దైవమ్
పారావారా స్వావృతి దైవమ్.

విద్యార్థులారా!

భగవంతుడు ఆకాశము కంటె నిర్మలమైనవాడు. సూర్య చంద్ర నక్షత్రాదులు కూడను దైవము యొక్క నేత్రములు. వాయువువలె సర్వత్ర వ్యాపించిన వాడు దైవము. ఇట్టి దైవత్వమును గుర్తించవలెనన్న మానవోపాధులైన దేహేంద్రియ మనో బుద్ధుల యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించినప్పుడే యీ విశాలత్వమైన యీ నిర్మలమైన యీ పవిత్రమైన ఆత్మ తత్వము మనకు అర్థమవుతుంది.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత
క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తజ్జ్ఞానం మతం మమ.

ప్రపంచమంతయు కూడను క్షేత్రక్షేత్రజ్ఞుల యొక్క సమ్మిళిత స్వరూపము. ప్రకృతి యొక్క ప్రతిబింబమే మానవుని యొక్క శరీరము. విశ్వమునందు ఏ చేతనా చేతనము లున్నవో అవన్నీ కూడను మానవుని యొక్క దేహమునందే యిమిడి వున్నది. ఈ ప్రపంచమంతయు కూడను మానవుని యందుండిన ప్రతిబింబమతే. Reflection of inner being ఇతే యీ శరీర మనో యింద్రియ బుద్ధులను గుర్తించినంత మాత్రమున చాలదు. ఈ క్షేత్రమును గుర్తించే క్షేత్రజ్ఞుడు ప్రత్యేకముగా వుంటున్నాడు. క్షేత్రజ్ఞుని గుర్తించినప్పుడే క్షేత్రము యొక్క విచారము మనకు అక్కరలేదు. అంతవరకు మాత్రం క్షేత్రమును తగిన రీతిలో అనుభవించుటకు తగిన ప్రయత్నం చేయాలి. ఈ క్షేత్రజ్ఞుని తెలుసుకోవాలంటే జ్ఞానము కావాలి. ఏమిటి యీ జ్ఞానము. కేవలము bookish knowledge నా కాదు. Superficial knowledge నా కాదు. General knowledge నా అసలే కాదు. Discrimination knowledge నా యిది వ్యక్తిగతమైనది. Practical knowledge యిది కూడను వ్యక్తిగతమైనది. పొద్దులలో యిమిడి వుంటున్నది. ఇవన్నియు

కేవలము భౌతికమైన లౌకికమైన జ్ఞానములు. వస్తు విచారణచేత గుర్తింబడే జ్ఞానము యిది పదార్థ జ్ఞానము. విషయమును ఆధారము చేసుకొని దాని యొక్క విశిష్టతను గుర్తించే జ్ఞానమూ యిది కూడను విషయ జ్ఞానమే. లభ్యమైన జ్ఞానము చేత దివ్యమైన ఆత్మతత్వమును ఎవ్వరు కూడను గుర్తించలేరు. వజ్రమును కోయవలెనంటే వజ్రము కావాలి. కాలులో విరిగిన ముల్లును తీయాలంటే ముల్లే కావాలి. ఆత్మ తత్వము గుర్తించాలంటే ఆత్మ జ్ఞానమే కావాలి.

ఈనాడు మనము భౌతికమైన ప్రపంచమునందు దేనిని జ్ఞానమని మనము భావిస్తున్నామో అది అంతా అజ్ఞానమే. ఆత్మ జ్ఞానమే సత్య జ్ఞానము. ఆత్మ అన్నా జ్ఞానమన్నా రెండూ ఒక్కటే. నిజమైన ఎరుకయే జ్ఞానము. పదార్థములను క్రోఢీకరించుకొని, విషయాలను సంగ్రహించుకొని తద్వారా తెలుసుకొనే జ్ఞానము కేవలము అజ్ఞానముతో సమానము. ఈ జ్ఞానమునకు జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత అనేటువంటి త్రిపుటి వుండదు. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత అనేవి మానసిక సంబంధమైన వృత్తులు. మనో నాశనమైన తరువాత మూలాధారమైన తత్వమే యీ జ్ఞానము. ఈ మానసిక సంబంధమైన విచారణా శక్తులు అన్నీ కూడను భ్రమలో. వృత్తిపై ఆధారపడి వుంటుంది. మానవుడు చూచినది మానవుడు విన్నది మానవుడు అనుభవించునది, మానవుడు ఆచరించునది యివన్నీ కేవలము దేహాత్మతో కూడిన భ్రమలు. కేవలము దేహము యొక్క తత్వమే యీ మనసు యొక్క స్వభావము. మనసు ఒక ఆకారమును ఒక విషయమును ఒక వస్తువును వదలి ఒక్క క్షణమైనా వుండుటకు వీలు కాదు. మనస్సు దేహాన్ని ఆశ్రయించి వుంటుంది. ఈ దేహమునకు వుండిన కన్ను ముక్కు చెవులు నోరు యీ పంచ భూతములన్నీ కూడను వాటిద్వారానే మనస్సు అన్నింటిని అనుభవిస్తున్నది. మనస్సు దేహము యొక్క నేత్రముల ద్వారా చూస్తున్నది. మనస్సు దేహము యొక్క కర్ణముల ద్వారా వింటున్నది. మనస్సుకు రూపము లేదు. మనస్సే మాయ. మనసే కోరిక. మనసే ప్రకృతి. మనసే అవిద్య. మనస్సే ప్రాకృతమైన భ్రాంతి. ఇట్టి భ్రాంతితో కూడిన మనస్సు ద్వారా సత్యనిత్యమైన బ్రహ్మ తత్వమును మనము అర్థము చేసుకోలేము చాలా కష్టము. ఏది మనకు నిజమైన జ్ఞానము. జ్ఞానమనగా మనస్సుచేత యింద్రియములను స్వాధీనము చేసుకొని యింద్రియ నాశనము గావించిన తరువాత మనస్సు కూడను అంతర్థానమవుతుంది అట్టి సమయమునందు ప్రశాంతమైన మౌన తత్వము యేర్పడుతుంది. ఈ మనో నాశము వలన కలిగిన మౌనమనేదే నిజమైన జ్ఞానము. ఈ జ్ఞానము తెలివి తేటల వలనగాని

లేక బుద్ధి కుశలత వలనగాని మరి యేవిధమైన ఆదర్శము వలనగాని లభించేది కాదు. ఇది జని సహజము. ఇది క్రొత్తదిగా మనము సంపాయించుకొనేది కాదు. నివురు గప్పిన నిప్పు వలె, పాచి కప్పిన జలము వలె, పొరకప్పిన కన్నువలె మన భ్రాంతి కప్పిన ఆత్మగా వుండుట చేతనే యీ జ్ఞానమును మనము గుర్తించలేక పోతున్నాము. ఈ నిప్పుపైన నివురు ఎలా వచ్చింది. ఎక్కడ నుండి వచ్చింది. నిప్పు నుంచినే వచ్చిన నివురు నిప్పునే కప్పి వేసింది. జలము పైన కప్పిన యీ పాచి ఎక్కడ నుండి వచ్చింది జలమునుండే వచ్చింది. మన కంటిలో పుట్టిన పొర ఎక్కడనుండి వచ్చింది బయటనుండి వచ్చిందా? లేదు మన కన్ను నుండియే ఆవిర్భవించింది. కప్పిన పొరను తీసివేస్తే స్వస్వరూపమైన తత్వము మనకు సాక్షాత్కరిస్తుంది.

కనుక జ్ఞానము గ్రంథముల వలన లభించేది కాదు. గురువుల వల్ల ప్రసాదింపబడేది కాదు లేక పరమాత్ముడు అందించేది కాదు. తానే పరమాత్మ తానే జ్ఞానము. తానే ఆత్మ ఇలా యీ జ్ఞానమనేది సర్వుల యందు ఎల్లప్పుడు వుంటున్నది అని మనము ఏకాంతముగా కూర్చుని విచారణ చేసినప్పుడు శాశ్వతమైన, సత్యమైన, మార్పు చెందని శబ్దము మన నుండి ఆవిర్భవిస్తున్నది. జగత్తునందున్న సమస్త పదార్థములు కూడను మార్పు చెందుతున్నాయి. సమస్త ఆకారములు మార్పు చెందుతున్నాయి. ప్రతి పదార్థము కేవలము అణుత్రయ భావమే. ఈ అణువుల చేరికయే పదార్థ స్వరూపము. కాలక్రమేణా యీ అణువులు కూడను వేరైపోతూ వుంటాయి. ఈ అణువుల యొక్క స్వభావము సంయోగ వియోగములయొక్క తత్వమే. కాని మార్పు చెందని, మార్పు కలగని ఒకే దివ్యమైన వాణి సర్వులయందు ఒక్కటిగానే వుంది. బాల్యమునందు, యవ్వనమందు, వార్థక్యమునందు దేహము మార్పు చెందుచున్నదిగాని ఆ వాణి మార్పు చెందటము లేదు. జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మూడు స్థానములు మనము అనుభవిస్తున్నామే గాని యీ వాణి మార్పు చెందటం లేదు. స్థూల సూక్ష్మ కారణములు మనము అనుభవిస్తున్నామే గాని యీ వాణి మార్పు చెందటం లేదు. ఏమిటి ఆ వాణి. ఆత్మ తత్వము నుండి వెలువడిన అంతర్వాణి. అదియే నేను నేను. నేను. అహం. అహం. అహం. ఇదే సత్యమైనది. ఈ సత్యము అణువు కంటె చాలా మరింత సూక్ష్మమైనది. Truth is more fundamental than atom. ఇలాంటి సత్య స్వరూపమైనది అహమ్. ఈ అహం చేత పూరింపబడిన తత్వమే సోహం. ఈ అహం దేహముతో తాదాత్మ్యము పొందినప్పుడు యిది అహంకారముగా మారుతున్నది. ఈ అహంకారము ప్రాకృతమైన భావము. అహం దివ్యమైన వాణి. దీనిని కేవలము పాండిత్యము

చేతగాని భిశక్తి చేతగాని గుర్తించటము అసాధ్యము. ఎంతగొప్ప పండితుడైనప్పటికిని దృష్టి లేకుండిన వస్తువు చూడలేడు. పాండిత్యము తెలియనప్పటికి, పామరుడైనప్పటికి కన్నులు వుంటున్నవాడు స్పష్టముగా చూడగలుగుతాడు. వేదశాస్త్ర ఇతిహాస పురాణములన్నియు పఠించిన మహా విద్వాంసుడైనప్పటికిని నిద్రయందున్నప్పుడు జాగ్రత్ ప్రపంచమును యేమాత్రము చూడలేడు. కాని మేలుకొన్న వ్యక్తి యేశాస్త్రములు చదవక పోయినప్పటికి ఏమీ తెలియక పోయినప్పటికిని జాగ్రత్ ప్రపంచమును చూడగలుగుతున్నాడు.

ఆదే విధముగనే మానవుడు గుర్తించలేని ఆత్మశక్తిని ఆత్మజ్ఞానమును కూడను చిత్తశుద్ధి చేత గుర్తిస్తున్నాడు.

సకల శాస్త్ర చయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు యావల జీవి దేవుడవ్వలనుండు
కార్యములను అవ్వల కారణంబు

మనస్సుకు ఆవలనుండి చూచునంతవరకు మనకు జగత్తే గోచరిస్తుంది. మనసు దాటి ఆవల చేరితిమా ఆత్మ గుర్తింపబడుతుంది. కనుక మనము అనుభవించే జ్ఞానములు గాని అనుభవించే అనుభూతులుగాని సర్వము కూడను మనసుకు ఇవ్వలనుండియే అనుభవిస్తున్నాము గాని మనస్సుకు ఆవల చేరలేదు. సముద్రములో చేరిన నదికి ప్రత్యేక రూపనామములుండవు. ఎప్పుడు సముద్రములో చేరిపోయెనో అప్పుడు రూపనామములు కోల్పోతుంది. సముద్రము ఒక్కటే నిలుస్తుంది. అప బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. బ్రహ్మ తత్వము కనుగొనుటకు బ్రహ్మ జ్ఞానమే కావాలి. ఆత్మ తత్వమును అర్థము చేసుకోటానికి ఆత్మ జ్ఞానమే కావాలి. కనుక మానవత్వములో ఆత్మ తత్వాన్ని మనము గుర్తించాలని ఆశపడే సాధకుడు భౌతికమైన క్రియలచేత ఆత్మ తత్వాన్ని పొందలుమనేది కేవలము మానసిక వృత్తులే. ఆత్మ సర్వత్ర వుంటున్నది. ప్రపంచమంతా వుండినది ఈ ఆత్మ తత్వమే. కేవలము దేహమున్నంత మాత్రమున మనకు గోచరిస్తుందనుకోటం కేవలము మానసిక కల్పనే. ఘటము వుండినా లేకపోయినా ఆ ఘటమునందు జలము వుండినా లేకపోయినా సూర్యప్రతిబింబము సర్వత్ర వుంటూనే వున్నది. ఘటము, ఘటములోని జలము వుండినప్పుడు ప్రత్యక్షముగా గోచరించవచ్చునే గాని అది లేనప్పుడు ఇది లేదని చెప్పుటకు వీలుకాదు. కనుక దేహము వుండినా, మనసు వుండినా లేకపోయినా ఆత్మ అక్కడ వున్నది. ఐతే ఈనాడు నీవు అనుభవించే అనుభూతులు

దీనికి సంబంధించినవి. దేహమనే పాత్రలో మనస్సనే జలము వుండటం చేత అందులో నీవు యేదో ఒక భ్రాంతి చేత నీయొక్క రూపాన్ని నీవు చూడగలుగుతున్నావు. పోనీ అది సత్యమని విశ్వసిస్తావా అంటే అది సత్యము కాదు. ఇది నీ ప్రతిబింబమే కాదని చెప్పుటకు వీలు కాదు. సాక్షాత్తు ప్రతిబింబము కాదు. ఎట్లనగా, విద్యార్థులు చక్కగా అర్థము చేసుకోవాలి, జలములో నీ ముఖమును నీవు చూస్తున్నావు నీ ముఖమే అందు కనుపిస్తున్నది గాని ఇది కేవలము వుల్టా సీదాగా వుంటున్నది. left right గాను right left గాను కనుపిస్తుంటాది. కనుక ఇది సత్యము ఎట్లా అవుతుంది. నీయొక్క భ్రాంతి చేత ఇది నీయొక్క ప్రతిబింబమని విశ్వసిస్తున్నావు. ఈ దేహము కూడను భ్రాంతిలో కూడినదే. కనుక దివ్యత్వాన్ని మనము గుర్తించాలనుకుంటే దేహము మనకు అక్కరలేదు. మనసు అక్కరలేదు. ఐతే దీనిని సరిగా అర్థము చేసుకొనే వరకును దేహేంద్రియ మనో బుద్ధులు చక్కగా మనము పోషించుకోవాలి. దేహము వుండాలి. ఇంద్రియములు వుండాలి. మనసు వుండాలి. ఐతే వీటిని సక్రమమైన మార్గములో మనము అనుభవించాలి. ఆ విధముగా సక్రమమైన మార్గములో మనము అనుభవించకుండా ప్రవేశ పెట్టకుండా మనము పెడమార్గములో ప్రవేశపెట్టినప్పుడే అనేక రకముల బాధలకు దుఃఖములకు విచారములకు గురౌతున్నాము.

ఇవన్నీ కూడను కేవలము భ్రమల చేతనే సంభవిస్తున్నాయి. మీరు రైలులో ప్రయాణమై పోతున్నారు. ప్రయాణమై పోతున్నది ఎవరు? మీరే. కానీ రైలుపెట్టెల కిటికీల నుండి మనము చూచినప్పుడు కొండలు గుట్టలు చెట్లు పరుగెత్తి పోయినట్లుగా కనుపిస్తున్నాయి. పరుగెత్తేది చెట్లు కాదు. పరుగెత్తేది కొండలు కాదు. పరుగెత్తేది మనమే. కనుక మనయొక్క మానసిక చాంచల్యము చేతనే సర్వము కూడను దీనియొక్క సత్యస్వరూపమైన ప్రతిబింబములని గుర్తించలేక ఇది ప్రకృతియొక్క మార్పులుగా మనము భావిస్తున్నాము. ఈ విధముగా మనము చక్కగా విచారణ చేస్తూ పోయినప్పుడు యీ నేను నేను అనే మార్పు చెందని సత్యము ఎక్కడనుండి వచ్చింది. నేను అనేది పుట్టిన తరువాతనే యీ సృష్టి అంతయు వచ్చింది. నేను లేని సృష్టి కలుగదు. నేను పుట్టిన తరువాతనే సృష్టి పుట్టింది. ఈ విధమైన విచారణ చేయాలి. ఈ ఆత్మతత్వమనేది సామాన్యముగా మనకు అర్థము కాదు. ఐతే ఆత్మ లేనిదే జగత్తు లేదు. ఉన్నదంతా అదెట్లైన పుట్టికి లేనిది యేదో ఒకటి వున్నదని మనము భ్రమిస్తున్నాము. ఎన్ని బలములు వుండినప్పటికిని, ఎంతటి సంపదలు ప్రోగుచేసుకున్నప్పటికిని యీ ఆత్మానుగ్రహము లేకపోతే సర్వము వ్యర్థమై పోతాయి. ప్రతి మానవునకు ఒక

free will స్వాతంత్ర్య మనేది ఒకటి వున్నదని విశ్వసిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. కేవలము వ్యక్తి యొక్క సంకల్పము చేతనే, వ్యక్తి యొక్క ప్రయత్నముల చేతనే, వ్యక్తి యొక్క సాధనల చేతనే మనము అనేక విధములైన ఫలితములు పొందుతున్నామని భ్రమిస్తున్నారు. ఇది కేవలము కర్తృత్వము యొక్క ప్రతిబింబము. ఇది కేవలము అహంకారము యొక్క వికారము. నిన్న చెప్పాను ఏ ప్రయత్నము లేకపోయినప్పటికిని గుండె కొట్టుకుంటున్నాది. గుండె కొట్టుకోటానికి ఏమి ప్రయత్నం చేస్తున్నాము ఏమీ చేయటం లేదు. మనము దుఃఖములో వుండినా ఆనందములో వుండినా, ప్రయాణము చేస్తున్నా కూర్చున్నా, నడుస్తున్నా యేవిధమైన స్థితిలో వుండినప్పటికిని మన యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుతూనే వున్నాయి. ఏమి ప్రయత్నము చేస్తున్నాము మనము. మనము భుజించే ఆహారము నడచినా నడవక పోయినా దానిని జీర్ణింప చేసుకోటానికి కొన్ని విధములైన చర్యలను మనము ఆచరించినా ఆచరించక పోయినా జీర్ణమవుతూనే వున్నది. దీనికి ఏ ప్రయత్నము చేస్తున్నాము మనము. నిన్న చెప్పాను చావాలంటే చావలేము పుట్టాలంటే పుట్టలేము. వుండాలంటే వుండలేము. ఇది కేవలము మానవుని యొక్క ప్రయత్నము చేత గాని సాధనల చేతగాని సంభవించేటువంటిది కాదు. ఏమీ చేయక పోయినా కొన్ని మనకు లభిస్తూ వుంటాయి. ప్రాప్తిస్తుంటాయి. ఫలిస్తూ వుంటాయి. కనుక యివన్నీ కూడను భగవంతుని యొక్క మాస్టరు ప్లానుతో. ఏ సమయమునకు ఏ కాలమునకు ఏ కర్తవ్యము ఏ యొక్క స్థితిలో అనుభవించాలో అది దానికే వదలాలి.

బుద్ధి బలము మరియు భుజబలంబున్నను
దైవ బలము లేక దీనుడగును
కర్ణుడంతటి వాడు కడపటి కేమయ్యె
మరువ బోకుడిట్టి మంచి మాట

కర్ణునకు భుజ బలము, బుద్ధి బలము, శస్త్రబలము, సర్వబలములు వుండి కూడను దైవ బలము లేకపోవటం చేత కట్టకడపటికి ఏమయ్యాడు. దైవ బలము నిజ బలము. ప్రాకృత బలము దుర్బలము. కాని శరీర, మానసిక బుద్ధిని మనము అనుసరించుకొని కేవలము యీ అనిత్యము అశాశ్వతమైన బలములనే ఆధారము చేసుకొని మనము ఆత్మతత్వాన్ని పొందుటకు ప్రయత్నం చేయటము కేవలము వెఱ్ఱితనము.

మనకు ఆత్మ జ్ఞానము లభ్యము కావాలనుకున్నప్పుడు శ్రేష్ఠమైన ఏకత్వమును మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ నాడు అట్టి ఏకత్వమును కోల్పోవటం చేతనే భిన్నత్వ

మం అభివృద్ధియై ద్వేషము అధికమైపోతున్నది. జ్ఞానమునకు భిన్నత్వముగాని వేరే విభాగము
గాని చేయుటకు వీలుకాదు. ఈ దివ్యమైన జ్ఞానము కేవలము మనమే. మనలో వున్నదనిగాని
మనము సంపాయించేదనిగాని మనము భావించరాదు. మనమే జ్ఞానము. మనమే అనంతము
మనమే సత్యము. మనమే బ్రహ్మ. దీనిని పురస్కరించుకొని సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అన్నారు.
ఈ జగన్నాటకమునకు మనము ధరించిన వేషము నాధారము చేసుకొని ఆ వేషమునకు
తగిన చరిత్రను మనము ప్రకటన చేస్తున్నాము. కాని యీ నాటకమునకు యీ action యీ రైలాగులు
సరిపోవచ్చునేమో కాని నిత్యసత్యమైన జీవితమునకు యేమాత్రము సమన్వయము కావు. పొద్దున్న
మీరు చూచి వున్నారు. మధ్యలో conscious అనే circle వుంది. క్రింద subconscious
అనే circle వుంటున్నది. పైన super conscious వుంటున్నది. అయితే ప్రతి మానవుని
యందు కూడను యీ దృశ్యకల్పితమైన జగత్తంతయు కూడను తమ యందు subconscious
రూపములో వుంటున్నది. ఇక్కడనుంచి consciousness కు బయలుదేరుతున్నది.
దీనికి ఒక చిన్న ఉదాహరణము. మీరు ఎప్పుడో ఒక పర్యాయము బదరీనాథ్, అమర్‌నాథ్
కేదారనాథ్ ఢిల్లీ బొంబాయి మీరు పోయి చూచి వుండవచ్చును. కానీ యీ దృశ్యమంతా ఎక్కడ
వుంది. ఒకతూరి ఢిల్లీపోయి, ఆగ్రాపోయి తాజ్‌మహల్ నీవు చూచినావంటే అది నీలో
subconscious లో నిలచిపోయింది. ఎప్పుడు నీవు తలచుకున్నా అప్పుడు నీకు ప్రత్యక్ష
మవుతుంది. ప్రత్యక్షముగా యిప్పుడు వుండిన టైములోపల యీ conscious కు రావాలంటే
sub conscious నుండే రావాలి. ...న్ని నీవు తెలుసుకోవాలంటే వర్తమానాన్ని, వర్తమా
నాన్ని తెలుసుకోవాలంటే గతాన్ని మనము చింతించాలి. కనుక నా వుద్దేశ్యము భవిష్యత్తు,
గతము వర్తమానమునందే వుంటున్నది. కాని యిది Present అని మనము భావిస్తున్నాము
అదే పెద్ద పొరపాటు. This is not Present This is omnipresent. గతము, భవిష్యత్తు
రెండు కూడను మన వర్తమానము నందే వుంటున్నవి. కాన భగవంతుడు ఎప్పుడు Omni
Present అన్నారు.

భగవంతుడు నిజముగా అన్నివేళలయందు అన్నికాలములయందు కూడ
ను వుంటుండే దివ్యశక్తి. ఇలాంటి దివ్యమైన భావాన్ని మనము అర్థము చేసుకొటానికి మన
యొక్క యింద్రియములు మనస్సు బుద్ధి సరైన స్థితిలో వుంచుకోవాలి. ఈనాడు విజ్ఞానిధాన
ము వేగముగా విరివిగా పెరుగుతూ వున్నాది. ఇవన్నియూ ఎవరినిమిత్తమై పెరిగినవి. ఈ
ఎలక్ట్రిసిటీ వచ్చింది. fans వచ్చాయి. machines వచ్చాయి. TVలు వచ్చాయి రేడియోలు

ఏడియోలు వచ్చాయి. ఇవన్నీ కేవలము పై జ్ఞానము వలన అభివృద్ధి యైనవే. ఇలా ఇవన్నీ ఎవరి కోసమని మనము ప్రశ్న వేసుకోవాలి. దీనిని ఎవరు అనుభవిస్తున్నారని మరొక ప్రశ్న వేసుకోవాలి. నేను అని ఒక జవాబు వస్తుంది. నేను లేకపోతే ఇవన్నీ ఎవరికి. కనుక నేను వుంటే అన్నీవస్తాయి. నేను లేకపోతే యేదీ లేదు. కనుక మానవుడనే వాడు అన్నింటి కంటెను చాలా విలువైన వాడు. మానవుడుగా పుట్టి తన ప్రయత్నము చేత మాధవుడుగా మారవచ్చు. కాని పశువుగా పుట్టి పశువుగానే జీవిస్తుంది గాని పశుపతిగా మారటానికి వలు లేదు. దానికి ఆత్మ భావము అనేది లేదు. ఈ ఆత్మకు అద్దు తగిలే మనస్సుకూడా దానికి లేదు. నిన్న చెప్పాను. సూర్యుని వేడిమి నుంచి ఏర్పడిన మేఘ సముదాయము సూర్యునే కప్పివేసినట్లుగా ఆత్మ నుండి పుట్టిన మానసిక మేఘ సముదాయము ఆత్మనే కప్పివేస్తుంది. కనుక మనుష్యత్వమనేది కేవలము దైవత్వముతో సమానమైనది. కనుక దైవం మానుష రూపేణ. men are more valuable than all the wealth of the world. మనకువుండిన ధన కనక వస్తు వాహనాదులన్నియు మానవుని కంటె మించినవి కాదు. అటువంటి నిత్య సత్యమైన ఆత్మ తత్వమును ఒక్క క్షణము చింతించి దర్శిస్తే అంతే చాలు. సర్వము కూడను మనము సాధించిన వారమౌతాము. కానీ మానవుడు దానినిమిత్తమై తగిన కృషి చేయటం లేదు. భౌతికమైన సుఖ సంతోష భోగ భాగ్యముల నిమిత్తమై అనేక విధములుగా కూడను తాను శ్రమలు పడుతున్నాడు. ఆ శ్రమలో ఏ వెయ్యింట ఒక భాగమో, ఏ కోటింట ఒక భాగమో మనము భగవంతుని చింతిస్తే ఆ దివ్యత్వమును మనము ఎంత ఆనందముగా అనుభవించ చవచ్చు.

యా చింతా భువి పుత్ర మిత్ర భరణే వ్యాపార సంభాషణే
యా చింతా ధన ధాన్య భోగ యశసే లాభే సదా జాయతే.
సా చింతా భువి నంద నందన పద ద్వంద్వారవిందే క్షణే
కా చింతా యమరాజ భీమ సదన ద్వార ప్రయాణే ప్రభో.

మనము ధన ధాన్య యశస్సుల నిమిత్తమై మనము ఎంత కాలమునకు వినియోగిస్తున్నామో మనము పుత్ర మిత్ర భరణ వ్యాపారములకై దుర్వినియోగపరచుకుంటున్నామో ఆ కాలములో క్షణ కాలము భగవంతుని పాదారవిందములపై పెట్టటానికి మనము కృషి చేస్తే. భీమ సదనం భయంకరమైన స్వర్ణ తలుపులు కూడను తమంతట తాము తెరుచుకొని మనకు స్వాగతమిస్తాయట. కనుక మనము ఆత్మ జ్ఞానమును, ఆత్మానందమును

పొందవలెనంటే దీనికి ఒక్కటే ఆధారము. అదే భక్తి. భక్తి అనగా కేవలము జపములు చేయుటమో, ధ్యానములు చేయుటమో, పూజలు చేయుటమో, యాత్రలు చేయుటమో ఇంకే విధమైన సత్కర్మలు ఆచరించుటమో కాదు. ఇవన్నీ భక్తి అనే పేరులో మనము అనుభవించే చిహ్నములు. గుర్తులు. స్వస్వరూప సంధానముపై మనసును తిప్ప వేయించుటమే నిజమైన భక్తి. ఇదే నిజమైన ఆత్మనిష్ఠ. కనుక జ్ఞానమన్నా భక్తి అన్నా వేరు కాదు. భక్తే జ్ఞానము. జ్ఞానమే భక్తి. రెండూ ఒకదానికొకటి అవినాభావ సంబంధమే అన్యోన్యాశ్రయమే. ఈ రెండింటిని కట్టివేసే ప్రధానమైన సూత్రము ప్రేమ. ఆ ప్రేమ సూత్రము చేతనే భగవంతుని బంధించవచ్చును. అనగా ప్రేమ ప్రత్యేకము కాదు. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. దేహములో యేర్పడే ప్రేమ క్షణ భంగురమైనది. భ్రాంతులలో యేర్పడిన ప్రేమ క్షణ భంగురమైనది. ఇవన్నీ తాత్కాలికమైన ప్రేమలు. దైవప్రేమ శాశ్వతమైనది. కనుకనే Love is God. Love is Love. దానియందే నవ్వు జీవించాలి.

ఎన్ని బాధలు కలిగినప్పటికిని, భౌతికమైన అనేక చికాకులు కలిగినప్పటికి ఇవన్నీ కదలిపోయే మేఘములే. ఈ కదలిపోయే మేఘముల నిమిత్తమై మనము ఆరాటపడనక్కరలేదు. సత్య నిత్యమైన ఆత్మ తత్వాన్ని పొందే నిమిత్తమై మనము తగిన విచారణ చెయ్యాలి. కనుక తమను తాము వుద్ధరించుకోవాలి. చాలామంది లోకములో యీ గ్రంధ పరిచయమైనవారు కొంచెము చాదస్త ఆచారములు కలిగినవారు కొన్ని భయ భ్రాంతులకు లోబడి పోతుంటారు. మమ్మల్ని వుద్ధరించేవారు యీ పుత్రులే అనుకుంటారు. ఎందుకంటె వారికి శ్రాద్ధములు పితృపిండములు వదులుతూ వుంటారు. వారివలన వీరికి ఉద్ధారము కలుగుతుందని వీరి భ్రాంతి. లోకములో ఎంత మంది పుత్రులు కలిగినవారు లేరు. వీరిని పుత్రులందరు వుద్ధారము చేస్తున్నారా? పుత్రులు లేనివారు ఎంతమంది లేరు. వీరందరు అధోగతి పాలౌతున్నారా?

కొడుకులు పుట్టరటంచు యేడ్తురు అవివేకుల్
జీవన భ్రాంతులై కొడుకులు పుట్టరు కౌరవేం
ద్రుల కనేకులు వారిచే యేగతిన్ వడసిరి
కొడుకులు లేని ఆ శుకునకు పెంపొందునే దుర్గతుల్.

కాదు. కాదు. వారు కాదు మనలను వుద్ధారము చేసేది. ఇవి చేసే ఆచారముల అర్ధము కూడను మనము గుర్తించుకోటం లేదు. సత్యార్థమును మనము గుర్తించుకున్నప్పుడే నిత్యతత్వమును

మనము అనుభవించవచ్చు. శ్రాద్ధము అంటాము. బ్రాహ్మణుని పిలిపించటము అతనికి పాదములు కడగటము పొట్టనిండా అన్న పెట్టటము వానిచే అక్షింతలు వేయించుకోటం యిదే శ్రాద్ధమై పోయింది అనుకోటము. శ్రాద్ధమనగా శ్రద్ధతో కూడినదని అర్థము. ఐతే పిండము అనగా ఏమిటి? పిండదానములు చేస్తున్నారు. పిండమనగా దేహమే. శ్రద్ధతో మన దేహమనే పిండమును భగవంతునికి అర్పితము గావించటమే నిజమైన శ్రాద్ధము. దీనిని వేదాంతమునందు కూడను మానవ శరీరమందు తుంగభద్ర అని పేరు పెట్టారు. ఒక నది కూడా వుంటున్నాది తుంగభద్ర అని. ఒక దగ్గర తుంగ ఒక దగ్గర భద్ర రెండూ చేరటం చేత తుంగభద్ర అని పేరు వచ్చింది. భద్ర అనగా మంచి, పవిత్రము, కళ్యాణము, శోభ అనే అర్థాలు వుంటున్నవి. తుంగ అనగా చాలా బలమైన గొప్ప విశాలము యీ విధమైన అర్థములు మనము తీసుకోవచ్చు. తుంగభద్ర అనగా ఏమిటి మంచి కార్యములు చేసేది యీ దేహము. గొప్ప కార్యము ఆచరించేది యీ దేహము. కళ్యాణ కార్యములలో ప్రవేశించేదే యీ దేహము. దివ్యమైన ఆదర్శము నందించేది యీ దేహము. కనుకనే దీనికి తుంగభద్ర అని పేరు వచ్చింది. కానీ దీనికింత గొప్ప పేరు పెట్టుకొని మన ఆచారములు యేవిధముగా ప్రవర్తిస్తున్నాము. పేరుమాత్రం గొప్పదే గాని ప్రవర్తన చాలా అల్పముగా వుంటుంటాది. పేరుకు తగినట్లుగా మనము ప్రవర్తించాలి. త్యాగరాజు నిజంగా సార్థక నామము. భోజరాజు అనేక విధములైన ఆభరణములు నిత్యజీవితమునకు అవసరమైన వస్తువులు పంపించాడు. చూచాడు దాన్నంతా. నిధి చాలా సుఖమా ఈశ్వర సన్నిధి చాలా సుఖమా నిజముగ తెలుపుము మనసా ఇంతేకాదు తన అంతర్భావముల యొక్క హృదయ పవిత్రతను కూడను వివరించుకున్నాడు. రామా! నీ పాదద్వందములను నా రెండు హస్తముల ద్వారా గట్టిగా పట్టాను. నీవు నన్ను వదలి ఎక్కడకు పోవటానికి వీలులేదు. 'నన్ను విడచి కదలకురా - రామయ్య రామా - కోదండ రామా - పట్టాభిరామా నన్ను విడచి కదలకురా' నీవు యేదో ఒక ప్లాను వేసుకున్నావు. కానీ నేను ఆ ప్లానును అంగీకరించను. వైభవములు యీ సిరిసంపదలు నా హస్తములో పెట్టి నీవు తప్పించుకు పోవాలని చూస్తున్నావా? ఇవన్నీ నేను స్వీకరించాలంటే నీ పాదాలు నేను వదలాలి. అప్పుడు నేను దీనికి చేతులు పట్టాలి. నేను వీటికి చేతులు పట్టను, నీ పాదములకే చేతులు పడతాను. ఇది త్యాగరాజు యొక్క నిజమైన త్యాగభావము.

విద్యార్థులారా! మీరు యీ లౌకిక జగత్తునందు యీ సమయమునందు యీ విధమైన అవకాశము కల్పించుకొని అనేకమంది అనుభవజ్ఞులు పెద్దలు ప్రబోధలు

430059011

మీరు యీపది దినములనుండి వింటున్నారు. దీనిని మీరు సార్థకము చేసుకుంటే అంతేచాలు. మీరు విన్నవి కన్నవి యే ఒకటి రెండైనను ఆచరణలో పెట్టి మీ జీవితములో ఆదర్శవంతమైన దానిని లోకమునకందించండి. ఈ ఆత్మతత్వమునకు లౌకిక ప్రమాణములన్ని మనము స్వీకరించాము. దీనినే తిరిగి వేదమునకు సమన్వయమైన మార్గమును విచారిస్తాము. భారతీయులకు అనాది కాలము నుండి అన్నివిధముల ఆధారము అందిస్తున్నది వేదమే. ఇది కేవలము ఒక వ్యక్తిలో ఆవిర్భవించినది కాదు. లేక పండితులలో లిఖించబడినది కాదు. ఇది అపౌరుషేయము. ఇది సాక్షాత్తూ శబ్దమునుండి ఆవిర్భవించినది. ఒక్కొక్క పన్నము నందు ముప్పది మూడు కోట్ల అక్షరాలు వుంటున్నాయి. కాని యిన్ని విధములైన అక్షరములు ఏ విధముగా అభివృద్ధి యైనాయి. వున్నవి కొన్ని అక్షరములే. విన్నవి కూడా. ఇవి అష్టాక్షరములే. దీనినే అనేకంగా కూడను ఆవరిస్తూ పోయాయి. ఇంగ్లీషు అక్షరములు యిరవై ఆరు. కాని యీ యిరవై ఆరు అక్షరముల లోపలనే యింతింత పుస్తకాలు రాస్తూ వుంటారు. ఈ అక్షరాలన్ని వదలి యింకొకటి వ్రాయటానికి వీలు లేదు. నాలుగు వైర్లు వుండిన వయొలిన్ లోపల నన్నూరు రాగములంతా పాడవచ్చు. అ,క,చ,ట,త,ప,య,శ యీ ఎనిమిది అక్షరములలోనే అష్టదిక్కులు వ్యాపించి సర్వైశ్వర్యమును అందులో యిమిడ్చి జగత్తుకు అందించింది. ఇది వినికిడి చేత లభించినది కనుకనే దీనికి శ్రుతి అని పేరు వచ్చింది. ఈ శ్రుతి ద్వారా మానవుడు కనుగొన్న సత్యాన్ని మానవుడు ఆచరించి తరించిన మార్గమును మనము మున్ముందు వేదము యొక్క ఆదర్శము వలన తెలుసుకోటానికి ప్రయత్నిస్తాము.